సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ׀ 4 ׀ జనవరి ׀ 2023



బంధువులతో మాట్లాడి వెళ్తుండగా..

బంధువులతో మాట్లాడి వేరే ప్రాంతానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న ఇద్దరు పాదచారులను మోటార్‌బైక్ ఢీకొంది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. - 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,410
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,128
3 శాతం జీఎస్టీతో	రూ.5,282
సవర (8 గ్రా)	రూ.42,256

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.5 /23.2

మంగళవారం గాలిలో 72 శాతం తేమ ఉంది. బుధవారం పొడి వాతావరణం ఉంటుంది. రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

డీజీపీని కలిసిన ఎస్పీ



నెల్లూరు(క్రైమ్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని మంగళగిరిలో సోమవారం రాత్రి ఎస్పీ సీహెచ్ విజయారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఎస్పీ డీజీపీకి వివరించారు.

94.44 శాతం మందికి పింఛన్లు



వేగూరులో లబ్ధిదారు రమణయ్యకు పెన్షన్ ఇచ్చేందుకు వేలిముద్ర వేయిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి

నెల్లూరు(పొగతోట): జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం ఆయా నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 3,14,237 మందికి పెన్షన్ నగదు అందజేయాల్సి ఉండగా ఇప్పటికి 2,96,753 మందికి నగదు ఇచ్చారు. దీంతో 94.44 శాతం నమోదైంది. వలంటీర్లు లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈనెల 7వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహించనున్నారు.

ఉద్యోగాలు, పదోన్నతుల పేరుతో మోసం


- రూ.కోటికిపైగా వసూలు
- పోస్టల్ ఉద్యోగి నిర్వాకం
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు



మాట్లాడుతున్న బాధితులు

ఆత్మకూరు: అతనో పోస్టల్ ఉద్యోగి. ఉద్యోగాలు ఇప్పిస్తానని, పదోన్నతులు వచ్చేలా చేస్తానని పలువురికి మాయమాటలు చెప్పి రూ.కోటికిపైగా వసూలు చేశాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు మంగళవారం ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. ఏఎస్‌పేట మండలం గుడిపాడు గ్రామానికి చెందిన అంకమరాజు గతంలో మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లిలో బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పనిచేశాడు. అనంతరం డిపార్ట్‌మెంట్ పరీక్షలు రాసి ఉద్యోగోన్నతి పొంది ప్రస్తుతం నెల్లూరులోని దర్గామిట్టలో పనిచేస్తున్నాడు. అయితే కొంతకాలం క్రితం పలువురు పోస్టల్ చిరుద్యోగులకు పదోన్నతులు ఇప్పిస్తానని, మరికొందరికి నూతన ఉద్యోగాలు ఇప్పిస్తానని నగదు వసూలు చేశాడు. మర్రిపాడు మండలం ఇస్కపల్లి గ్రామానికి చెందిన కె.గోపాలకృష్ణ చుంచులూరు గ్రామంలో బీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి ప్రమోషన్ ఇప్పిస్తానని రూ.15 లక్షలను అంకమరాజు వసూలు చేశాడు. అలాగే ఏఎస్‌పేట మండలానికి చెందిన దండే ప్రసాద్ నుంచి రూ.3 లక్షలు, అనంతసాగరం మండలానికి చెందిన భోగ్యం పెంచలప్రసాద్ వద్ద రూ.3.50 లక్షలు, ఆత్మకూరు మండలం దేపూరు గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ వద్ద రూ.6 లక్షలు, దాసరి శ్రీనివాస్ నుంచి రూ.3.50 లక్షలు, పెండెం పెంచలప్రసాద్ దగ్గర రూ.3 లక్షలు, కె.రాజా అనే వ్యక్తి దగ్గర రూ.3.50 లక్షలు, ఇంకా అనేక మంది నుంచి సుమారు రూ.కోటికి వసూలు చేశాడు. ఈ డబ్బు అతను క్రికెట్ బెట్టింగ్, గుర్రపు పందేలకు వాడేశాడని బాధితులు ఆరోపించారు. కాగా పదోన్నతి ఇప్పిస్తానని మోసం చేశాడంటూ గోపాలకృష్ణ అంకమరాజు మీద నవంబర్ నెలలో మర్రిపాడులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ కేసు విషయంలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో బాధితులంతా కలిసి ఆత్మకూరు సీఐని కలిసి ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని సీఐ తెలిపారు.

టీడీపీలో కరివేపాకులు



జిల్లాలో చంద్రబాబు పర్యటన తర్వాత మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు భవిష్యత్‌పై అయోమయంలో పడ్డారు. తొలుత కందుకూరు, కావలి, ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాల్లో పర్యటన ఉంటుందని ప్రకటించినా.. ఆఖరి క్షణంలో ఉదయగిరి పర్యటన వాయిదా వేసుకున్నారు. చివరాఖరుకు మూడు నియోజకవర్గాల్లో తిరిగినా.. వాటిల్లో ఫలానా అభ్యర్థి ఉంటారని మాత్రం ఎక్కడా చెప్పలేదు. ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడం, సీఎంను దూషించడం.. ఈ రెండింటి మీదే పర్యటన సాగింది. కోవూరు వరకు వచ్చిన చంద్రబాబు కూతవేటు దూరంలోని నెల్లూరులో ఉంటున్న నగర ఇన్‌చార్జిని కూడా పరామర్శించడానికి వెళ్లలేదు. టీడీపీలోకి పక్క పార్టీల్లోని సమర్థులైన నాయకులు రావాలని పిలుపునివ్వడం చూస్తే రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఆ పార్టీలో కింగ్‌లనుకునే అందరూ కరివేపాకులే అని సంకేతాలు ఇచ్చినట్లు అర్థమవుతోంది.

- నగర ఇన్‌చార్జి పరామర్శకు రాని చంద్రబాబు
- పార్టీలో సమర్థులు లేరా?.. స్వపక్షం రుసరుసలు
- ఏ నియోజకవర్గం నుంచి ఎవరిని పోటీలో పెడతారో తెలియని అయోమయం
- చంద్రబాబు పర్యటనలో కోవూరులో భగ్గుమన్న వర్గ విభేదాలు
- రూట్‌మ్యాప్‌లో ఉదయగిరిని తప్పించిన వైనం

➡ వేరే పార్టీల నేతలకు అధినేత ఆహ్వానం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటన తర్వాత ఆ పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం ఆవరించింది. కందుకూరు సభలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత కావలి, కోవూరు నియోజకవర్గాల్లో పర్యటించినా పార్టీ నేతల్లో జోష్ నింపలేకపోయారు. అధినేత పర్యటనకు ఆయా నియోజకవర్గాల్లోని మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఆశావహులు రూ.లక్షలు కుమ్మరించి భారీ ఫ్లెక్సీలతో హడావుడి చేశారు. అయితే అధినేత మాత్రం ఏ నియోజకవర్గంలో తన పార్టీ తరఫున ఫలానా నాయకుడు మీకు అండగా ఉంటారని, పోటీలో ఉండబోతారని ఎక్కడా చెప్పలేదు. కాగా పక్క పార్టీల్లో బలమైన, సమర్థులైన నేతలు టీడీపీలోకి రావాల్సిన అవసరం ఉందంటూ పిలుపునివడంతో ఇన్నాళ్లు పార్టీ కోసం పాకులాడుతున్న సీనియర్లు కంగుతినాల్సిన పరిస్థితి వచ్చింది. రేపటి ఎన్నికల్లో తమకు టికెట్ వస్తుందా? రాదా? అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

అసంతృప్తి జ్వాలలు.. వర్గ విభేదాలు

చంద్రబాబు జిల్లా పర్యటన తర్వాత అడుగడుగునా ఆ పార్టీ నేతల్లో అసంతృప్తి జ్వాలలు, వర్గ విభేదాలు రగిలాయి. కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కరివేపాకేనని స్పష్టమైంది. కావలిలో బీద రవిచంద్ర కనుసన్నల్లోనే పార్టీ వ్యవహారాలు నడుస్తున్నాయి. పైకి మాత్రం కావలి తనకు వద్దంటూనే బీద గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డిని కాదని తన అనుచరుడిగా ఉన్న ఓ మండల స్థాయి లీడర్ సుబ్బానాయుడికి ఏకంగా నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించేలా చేశాడు. టీడీపీ హయాంలో సహజవనరులు దోచుకుని రూ.కోట్లు సంపాదించిన ఈ చోటా నేతతో చంద్రబాబు పర్యటనకు భారీగా ఖర్చు పెట్టించాడు. అయితే చంద్రబాబు సభలో కావలి అభ్యర్థి ఫలానా అని చెప్పకపోవడంతో సుబ్బానాయుడు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నాడు.

➡ కోవూరులో పరిస్థితిలో మరోలా ఉంది. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి వర్గాల మధ్య అంతర్గతంగా విభేదాలు కొనసాగుతున్నాయి. మొన్న జరిగిన చంద్రబాబు పర్యటనలో కూడా ఇరువురూ కలిసి పనిచేయలేదు. వేర్వేరుగా స్వాగతం పలికారు. కోవూరు సభలో మాత్రం పోలంరెడ్డి తనయుడు దినేష్‌రెడ్డి ప్రచార వాహనంలో ఉన్నాడు. కోవూరు టికెట్ తన కొడుక్కే దక్కుతుందని శ్రీనివాసులురెడ్డి ఇది వరకే కార్యకర్తలకు పరిచయం చేయడం, ఇంకా ప్రచార వాహనంలో బాబు పక్కనే ఉండేలా చేయడంలో సక్సెస్ అయ్యారు. ఇక్కడ చేజర్ల కరివేపాకులా మారాడు. పార్టీకి వీరవిధేయుడిగా ఉన్న ఆయనకు కనీసం ప్రచార వాహనంలో కూడా స్థానం ఇవ్వలేదు. కానీ చంద్రబాబు తమ అభ్యర్థిగా దినేష్‌ను పరిచయం కూడా చేయకపోవడం ఇరువర్గాల్లో అసంతృప్తి నెలకొంది.

➡ ఇకపోతే పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ప్రతి ఎన్నికల్లోనూ కరివేపాకులా మారారనే చెప్పాలి. కోవూరు టికెట్ సాధించేందుకు రెండు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్నాడు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ముద్ర వేసుకుని పార్టీ కోసం కష్టపడుతున్న నాయకుడు. ప్రతి ఎన్నికల సమయంలో పెళ్లకూరుకు టికెట్ అంటూ ప్రచారం మాత్రం జోరుగా ఉంటుంది. చివరాఖరుకు ఇంకొకరు పోటీలో నిలబడతారు. ఒకానొక దశలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పేరు ఖరారు చేసి చివరి క్షణంలో ఆయన్ను తప్పించి వలస నేత అబ్దుల్ అజీజ్‌కు ఇచ్చారు. ఇలా ఎన్నో సార్లు పెళ్లకూరు మరో కరివేపాకు అయ్యాడు.

ముఖం చాటేశారు

పార్టీ కోసం చొక్కాలు చించుకుని పనిచేసిన టీడీపీ ముఖ్య నేతలకు సైతం చంద్రబాబు ముఖం చాటేశారు. టీడీపీ ముఖ్య నాయకుల్లో నెల్లూరు నగర నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఒకరు. ఇటీవల ఆయన ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యారు. మూడురోజులు జిల్లాలో ఉండీ.. నెల్లూరుకు కూతవేటు దూరంలోని కోవూరు వరకు వచ్చిన చంద్రబాబు కనీసం పరామర్శకు కూడా రాలేదు. బాబు పర్యటన షెడ్యూల్‌లో కోటంరెడ్డికి పరామర్శ కార్యక్రమం ఉన్నట్లు చూపించారు. అయితే రాకుండానే వెళ్లిపోయారంటే ముఖ్య నేతలకు చంద్రబాబు దగ్గర ఉన్న విలువెంతో అర్థమవుతోంది. జిల్లా పార్టీ నేతల ద్వారా కోటంరెడ్డి చంద్రబాబును తన ఇంటికి తీసుకురమ్మని శతవిధాలా ప్రయత్నాలు చేయించినా సక్సెస్ కాలేదు. ఆయన్ను బాబు కరివేపాకులా తీసేశాడని తెలుగు తమ్ముళ్లే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. గత ఎన్నికల్లో మాజీ మంత్రి నారాయణకు సహకరించలేదనే లెక్కలు ఉండడంతో చంద్రబాబు ఆయన్ను పట్టించుకోలేదనే ప్రచారం జోరుగా జరుగుతోంది.

బలంగా వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్‌సీపీకి బలమైన పట్టు ఉన్న జిల్లాలో టీడీపీ ప్రస్తుతం ఉనికి కోసం పాకులాడే పరిస్థితి నెలకొంది. గత సార్వత్రిక ఎన్నికల నుంచి స్థానిక సంస్థలు, తిరుపతి పార్లమెంట్, ఆత్మకూరు ఉప ఎన్నికల వరకు వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ముందు సైకిల్ పంక్చరైంది. ఆత్మకూరు ఉప ఎన్నికల్లో పార్టీ పోటీ చేయక పోయినా బీజేపీకి లోపాయికారీ మద్దతు ఇచ్చినా వృథా అయింది. ఈ క్రమంలో జిల్లా పార్టీని బలోపేతం చేసేందుకు టీడీపీ అధినేత 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం ద్వారా జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటన చేసినా పార్టీలో జోష్ రాలేదు.. నేతల్లో అసంతృప్తి జ్వాలలను రగిల్చి వెళ్లాడు.

దుకాణాల ఏర్పాటుకు టెండర్ల ఆహ్వానం

నెల్లూరు(క్రైమ్): ఏపీ పీటీడీ (ఆర్టీసీ) నెల్లూరు రీజియన్ పరిధిలోని వివిధ బస్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న 64 దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి పీవీ శేషయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీజియన్‌లోని ఉదయగిరి డిపో పరిధిలో 14, రాపూరులో 7, నెల్లూరు–2 డిపో పరిధిలో 14, వన్ డిపో పరిధిలో 20, కావలి డిపో పరిధిలో 6, ఆత్మకూరు డిపో పరిధిలో 3 దుకాణాలు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయాల్లో ఈనెల 5వ తేదీ వరకు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, ఆసక్తిగల వారు ఆరో తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలోని బాక్స్‌లో వేయాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలకు టెండర్లు తెరుస్తామని పీవీ శేషయ్య తెలియజేశారు.

భార్యపై భర్త హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న కోపంతో భార్యపై భర్త కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన నెల్లూరులోని నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలోని మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కోటమిట్టలో నివాసం ఉండే సంతోష్ మనోజిని భర్త మృతిచెందడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తోంది. నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలోని సాలివీధిలో ట్యూషన్స్ చెబుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈక్రమంలో పప్పులవీధికి చెందిన రవి అనే వ్యక్తి ఆమెను రెండో వివాహం చేసుకున్నాడు. ఇటీవల వారి మధ్య విభేదాలు వచ్చాయి. భర్త తనను వేధిస్తున్నాడంటూ మంగళవారం ఆమె చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాయంత్రం ఆమె నవాబుపేటలో ట్యూషన్ చెప్పేందుకు వెళ్తుండగా రవి ఆమెను అడ్డుకున్నాడు. తనపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ కత్తితో ఆమె గొంతుపై పొడిచి పరారయ్యారు. గాయపడిన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం అపోలో హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్నాం



లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగిన పింఛన్ల పెంపు వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో మంత్రి కాకాణి, జేసీ కూర్మనాథ్, ఇతర అధికారులు కలిసి వీక్షించారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు మంత్రి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు ఇస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్‌ను పెంచుకుంటూపోతూ ఇప్పుడు రూ.2,750 ఇస్తున్నారన్నారు. గతంతో పోలిస్తే లబ్ధిదారుల సంఖ్య పెరిగిందన్నారు. నెలకు రూ.87.70 కోట్లను పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 39 లక్షల మందికి పింఛన్లు ఇవ్వగా తమ ప్రభుత్వంలో 64 లక్షల మందికి ఇస్తున్నామన్నారు. ఈ ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. పింఛన్లు తొలగిస్తున్నారని ధర్నాలు చేసేవారు వాస్తవాన్ని చూడాలని హితవు పలికారు. కారు ఉందని, ఉద్యోగం ఉందనే సమాచారంతో 11,987 మందికి నోటీసులు ఇచ్చామని అందులో 8 వేల మందికి అర్హత ఉండడంతో తిరిగి పెన్షన్లు ఇస్తున్నామన్నారు. నగర మేయర్ పొట్లూరు స్రవంతి మాట్లాడుతూ తమది పేదల ప్రభుత్వమన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ గతంలో నగరంలో 20,060 మందికి పింఛన్లు వచ్చేవని, ప్రస్తుతం 49,160 మందికి ఇస్తున్నారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ హరిత, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, కార్పొరేటర్లు రాజా, మొయిళ్ల గౌరి, వాసంతి, హమీద, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆనం వ్యాఖ్యలు దురదృష్టకరం

రాష్ట్రంలో అభివృద్ధి విషయంలో వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. పింఛన్లు ఇస్తేనే ప్రజలు ఓట్లేస్తారా.. రోడ్లు గుంతలమయమయ్యాయని రామనారాయణరెడ్డి అనడం సమంజసం కాదన్నారు. ఓట్ల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు ఇవ్వడంలేదన్నారు. ఆసరా లేని పేదలకు సామాజిక భరోసా కల్పిస్తూ బాధ్యతగా పెన్షన్లు ఇస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో రోడ్లపై గుంతలున్నాయన్నారు. తమ ప్రభుత్వం రూ.2 వేల కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లను మరమ్మతులు చేసిందన్నారు. అలాగే పంచాయతీరాజ్ రోడ్లకు రూ రూ.1,100 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. పనులు జరుగుతున్నాయన్నారు. అప్పట్లో వర్షాల్లేక ప్రజలు కరువుతో అల్లాడారన్నారు. పింఛన్ల కోసం తమ ప్రభుత్వం రూ.21 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇటీవల కాలంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ విషయాలు పరిశీలించుకోవాలంటూ రామనారాయణరెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



సభకు విచ్చేసిన లబ్ధిదారులు తదితరులు

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి

నెల్లూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని కనుపర్తిపాడులో ఉన్న వీపీఆర్ విద్య స్కూల్లో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ ఎడ్యుకేషన్‌ను ప్రోత్సహించే దిశగా ట్యాబ్‌లను అందించడం హర్షణీయమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలకు ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, స్కూల్ సీఈఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమశిలలో 71.997 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 71.997 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 6,464 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 2,520 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 450, దక్షిణకాలువకు 300, కండలేరుకు 1,600 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.760 మీటర్ల మట్టం నమోదైంది. సగటున 306 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది.

గ్రూప్‌–1 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- జేసీ కూర్మనాథ్



మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(అర్బన్): ఈనెల 8వ తేదీ నుంచి జరిగే గ్రూప్‌–1 పరీక్షల కోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి లోపాల్లేకుండా నిర్వహించాలని జేసీ కూర్మనాథ్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో పరీక్షల ముందస్తు ఏర్పాట్లపై డీఆర్వో వెంకటనారాయణమ్మతో కలిసి జేసీ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 6,045 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వారి కోసం 16 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏపీపీఎస్సీ సూచనల మేరకు ప్రతి కేంద్రానికి ఒక జిల్లా అధికారిని లైజనింగ్ ఆఫీసర్‌గా నియమించామన్నారు. వారు చీఫ్ సూపరింటెండెంట్లతో సమన్వయం చేసుకుని పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, నాగరాజు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, ఐటీడీఏ పీఓ మందా రాణి, సెట్నల్ సీఈఓ పుల్లయ్య, మైనార్టీ వెల్ఫేర్ అధికారి కనకదుర్గాభవాని, సివిల్ సప్లయీస్ డీఎం సుధాకర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహితపై లైంగికదాడికి యత్నం

- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
- ఆమె, బంధువులపై నిందితుడి దాడి

అనుమసముద్రంపేట: వివాహితపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆమె, బంధువులపై అతను దాడి చేసిన ఘటన ఏఎస్‌పేట మండలంలోని గుడిపాడు దళితకాలనీలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. దళితకాలనీలో ఓ వివాహిత నివాసం ఉంటోంది. సోమవారం రాత్రి ఆమె ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అదే ప్రాంతంలో నివసించే గురునాథం వెంకటయ్య వెళ్లి లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలు ప్రతిఘటించడంతో అతను పరారయ్యాడు. ఈ విషయాన్ని ఆమె బంధువులకు తెలపడంతో అర్ధరాత్రి సమయంలో అందరూ వెళ్లి ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఇంటికి వెళ్లిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశారన్న కోపంతో వెంకటయ్య బాధితురాలు, ఆమె బంధువులపై కర్రతో దాడి చేశాడు. దీంతో వారు పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. వెంకటయ్య నుంచి తమకు ప్రమాదం ఉందని, అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎస్సై సుబహాని మాట్లాడుతూ వెంకటయ్యపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

నాటుసారా స్వాధీనం

- సెబ్ అధికారుల దాడులు
- ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన నిందితులు, నాటుసారాతో సీఐ, సిబ్బంది

సంగం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి ఆదేశాలతో మంగళవారం సాయంత్రం మండలంలోని జంగాలకంద్రిక గ్రామంలో నాటుసారా స్థావరంపై సెబ్ బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మారుమూల ప్రాంతంలో అక్రమంగా నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అదే విధంగా గురునాథం మధు అనే వ్యక్తి ఇంట్లో 12 లీటర్ల నాటుసారా, 30 కిలోల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మధుతోపాటు బాలు, మరో మహిళను సైతం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్సై అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవపాళ్ల ఘటనపై కేసు నమోదు

నెల్లూరు: దగదర్తి మండలం ఉలవపాళ్లలో పెట్రోల్‌బంక్‌లో గతనెల 31వ తేదీన పంప్‌బాయ్‌పై దాడికి పాల్పడిన ఘటనపై దగదర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఉలవపాళ్లలోని ఐఓసీ పెట్రోల్‌బంక్‌లో అదే గ్రామానికి చెందిన తేజ పంప్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో డిసెంబర్ 31వ తేదీన బోడిగుడిపాడుకు మహేష్‌నాయుడు డీజిల్ కోసం టిప్పర్ డ్రైవర్‌ను పెట్రోల్‌బంక్‌కు పంపించాడు. ఆ సమయంలో ఆన్‌లైన్ పేమెంట్ విధానం పనిచేయకపోవడంతో డబ్బులు చెల్లిస్తే డీజిల్ పడతానని తేజ చెప్పాడు. చేతిలో డబ్బులు లేవ డ్రైవర్ చెప్పగా తేజ వినలేదు. తమ ఓనర్ తిడతాడని, డబ్బు చెల్లించి ఆయిల్ పట్టించుకోవాలని సూచించడంతో టిప్పర్ డ్రైవర్ ఇదే విషయాన్ని మహేష్‌నాయుడికి ఫోన్‌లో వివరించాడు. అతను డ్రైవర్ ఫోన్ ద్వారా పంప్‌బాయ్‌కి చెప్పాడు. తేజ వినకపోవడంతో ఇరువురి మధ్య ఫోన్‌లోనే స్వల్ప వాదోపవాదాలు జరిగాయి. దీంతో మహేష్‌నాయుడు, అతడి కార్ డ్రైవర్ మస్తాన్ నేరుగా పెట్రోల్‌బంక్‌కు వచ్చి పంప్‌బాయ్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన తేజ కావలి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా బాధితుడు లిఖితపూర్వక ఫిర్యాదులో పొందుపరిచిన అంశాల ఆధారంగా దగదర్తి పోలీసులు ప్రాథమికంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, సెక్షన్‌లు 323, 324 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 127
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 246
లేయర్ చికెన్	: 145

టెండర్ ప్రకటన

ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా యొక్క వైద్యశాలల నందు ఉన్న ఇన్‌పేషెంట్ (in-patient) లకు మరియు విధి నిర్వహణలో ఉన్న వైద్యులకు ఆహారం (డైట్) సరఫరా చేయుటకు అర్హులైన కాంట్రాక్టర్ల (Contractors) వద్ద నుండి సీల్డ్ టెండర్ (Sealed Tenders) లను కోరడమైనది. ఆసక్తి గల వారు District Coordinator of Hospital Services, Nellore వారి పేరు మీద తీసిన రూ. 1,000/-ల డి.డి. ను చెల్లించి టెండర్ షెడ్యూల్ పత్రములు మరియు తదితర వివరములను నుండి క్రింద తెలుపబడిన తేదీలలో అన్ని పనిదినములలో పొందవచ్చును.

తేదీ 04-01-2023 నుండి 11-01-2023 సా॥ 3 గంటల వరకు టెండర్ షెడ్యూల్ పత్రములు District Coordinator of Hospital Services, SPS Nellore District, 1st Floor, Old Jubilee Hospital, Near Vegetable Market, Nellore, SPSR Nellore District వారి కార్యాలయము నందు లభించును.

సీల్డ్ టెండర్ షెడ్యూల్ పత్రములు స్వీకరించుటకు చివరి తేది 11-01-2023 సా॥ 5 గంటలు.

ఇట్లు, డా.యస్. రమేష్ నాథ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

బాలికల హక్కుల పరిరక్షణకు చర్యలు



మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

- సారా ఉద్యమం స్ఫూర్తితో సబల కార్యక్రమం
- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



కార్యక్రమానికి హాజరైన అధికారులు, విద్యార్థినులు

నెల్లూరు(పొగతోట): బాలికలకు ఉన్న హక్కులను పరిరక్షించేందుకు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకున్నాయని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. సమగ్ర శిక్ష, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా శ్రీకారం చుట్టిన సబల కార్యక్రమాన్ని మంగళవారం నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభించారు. ముందుగా సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అన్నారు. మహిళలు ఎక్కడైతే గౌరవించబడతారో ఆ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బాలికలు, మహిళలు సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు సూచనల మేరకు సబల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దీని ద్వారా బాల్య వివాహాలను అరికట్టడం, లింగవివక్షను రూపుమాపడం, మహిళలు, బాలికలకు చట్టాల గురించి అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలు చేపడతారన్నారు. జిల్లాలో గతంలో సారా ఉద్యమానికి నాంది పలికినట్లు చెప్పారు. అదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో సబల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. బాలికలు చదువుకోవాలన్న సంకల్పంతోపాటు వారి ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడి రాణిస్తున్నారని తెలిపారు. కొన్నిచోట్ల ప్రాంతాల్లో కట్టుబాట్లకు లోబడి మహిళలు ముందుకు రాలేకపోతున్నారన్నారు. పురుషుడు చదువుకుంటే అతనొక్కడే విజ్ఞానవంతుడవుతారన్నారు. మహిళలు చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం విజ్ఞానవంతులవుతారని చెప్పారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే చేసిన పోరాట ఫలితమే బాలికలకు ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పడ్డాయన్నారు. బాలికలు శారీరక, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆటలాడాలన్నారు. యోగా చేయాలని సూచించారు. అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిత్యం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను బాలికలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా డీకేడబ్ల్యూ కళాశాల విద్యార్థినులు అనూరాధ, మధులత, యామిని ఆలపించిన గేయాలు అలరించాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, ఐటీడీఏ పీఓ మందా రాణి, డ్వామా పీడీ వెంకట్రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ వెంకటయ్య, మైనారిటీ వెల్ఫేర్ అధికారి కనకదుర్గాభవాని, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పరిమళ, వివిధ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అండగా నిలిచారు. ఆయన్ను విమర్శించే అర్హత ప్రతిపక్ష నేత చంద్రబాబుకు లేదు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కోవూరులో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్షల కోట్ల రూపాయలు సంపాదించాడన్నారు. బాబు తండ్రికి రెండు ఎకరాల భూమి ఉండేదన్నారు. అందులో తమ్ముడికి ఒక ఎకరా పోను చంద్రబాబుకి ఒక ఎకరా మాత్రమే వచ్చిందన్నారు. ఒక్క ఎకరా భూమితో లక్షల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారో చంద్రబాబు ప్రజలకు చెప్పాలన్నారు. కూతురిని ఇచ్చిన పాపానికి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, ఆయన ఆస్తులు దోపిడీ చేశాడని ఆరోపించారు. మాది జమీందారీ కుటుంబమనే విషయం రాష్ట్రమంతా తెలుసన్నారు. ఎంతో భూమి ఉంటే సీలింగ్‌లకు, ఇళ్ల స్థలాలకు ఇచ్చిన చరిత్ర తమదన్నారు. అక్రమంగా కోట్లు సంపాదించానని రుజువు చేస్తే ఆ మొత్తాన్ని అనాథలకు ఇస్తానన్నారు. బ్రాందీ షాపుల్లో కమీషన్ తీసుకొని బతకాల్సిన పరిస్థితి తనకు లేదన్నారు. ఎవరో రాసిన దానిని ఇటీవల కోవూరు సభలో చంద్రబాబు చదవడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఆయన ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా ఆ ప్రాంతంలో మారణహోమం జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కందుకూరు పర్యటనలో 8 మంది మృతికి కారణమయ్యాడన్నారు. సంక్రాంతి కానుక పేరుతో బూటకపు మాటలు చెప్పి జనాన్ని గుంటూరుకు రప్పించి ముగ్గురు ప్రాణాలను పొట్టన పెట్టుకొన్న నీచుడు చంద్రబాబు అన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తే సహించమన్నారు. సమావేశంలో డీఏఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పి.రాధాకృష్ణారెడ్డి, నల్లపరెడ్డి రజిత్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు కె.శ్రీలత, ఏఎంసీ చైర్మన్ ఆర్.మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, సర్పంచ్ వై.విజయ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ ఊరు ఉత్సవం



పోలేరమ్మ ఆలయానికి ప్రత్యేక అలంకారం




పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నాయకులు



సద్దిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

అల్లూరు: అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ ఊరు ఉత్సవం సందర్భంగా పూజా కార్యక్రమాలను గ్రామపెద్దల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మకు ఏకకాలంలో అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం అక్కాచెల్లెళ్లు అయిన గ్రామదేవతలు గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మకు ప్రజలు సద్ది నైవేద్యాన్ని పెట్టారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు అభిషేకాలు, కుమ్మరి వారి సంప్రదాయ అఖండ ప్రతిష్ట, మధ్యాహ్నం పొంగళ్లు, సాయంత్రం రత్నాలంకారం, బంగారు చీరలో అమ్మవారి ప్రత్యేక దర్శనం, విశిష్ట పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఊరు ఉత్సవం సందర్భంగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన వెంట సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ యాదవ్, వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ శశిరేఖ, నాయకులు మేడా కృష్ణారెడ్డి, కోడూరు సాధిక్‌రెడ్డి, దైవాదీనం, సామంతుల సురేష్‌రెడ్డి, ఊటు అశోక్‌కుమార్‌రెడ్డి, మధురెడ్డి, మల్లి, మునిరాజ్, సుధీర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, బత్తల సుధా తదితరులున్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.14
సన్నవి	: రూ.10
పండ్లు	: రూ.4

బంధువులతో మాట్లాడి వెళ్తుండగా..

- పాదచారులను ఢీకొట్టిన బైక్
- అన్నదమ్ములతోసహా ముగ్గురికి తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ అన్న మృతి



మాల్యాద్రి మృతదేహం

కొడవలూరు: బంధువులతో మాట్లాడి వేరే ప్రాంతానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న ఇద్దరు పాదచారులను మోటార్‌బైక్ శరవేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో అన్నదమ్ములైన పాదచారులిద్దరూ, బైక్ నడిపిన వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని నాయుడుపాళెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బిట్రగుంటకు చెందిన గుర్రంకొండ మాల్యాద్రి (50) ఆయన తమ్ముడు రఘు కారులో నెల్లూరుకు బయలుదేరారు. మార్గమధ్యలో నాయుడుపాళెం వద్ద కారు ఆపి హైవేకు పడమర వైపున్న అశోక్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు. కొద్దిసేపటి తర్వాత కారు వద్దకు వెళ్లేందుకు అన్నదమ్ములిద్దరూ రోడ్డు దాటుతుండగా, నెల్లూరు వైపు నుంచి అతివేగంగా వచ్చిన పల్సర్ బైక్ ఢీకొట్టింది. దీంతో అన్నదమ్ములిద్దరూ రోడ్డుపై పడిపోవడంతోపాటు బైక్ నడుపుతున్న గణపతి కూడా పడిపోయాడు. ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై జి.సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో అన్నదమ్ములను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నెల్లూరుకు చెందిన గణపతిని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న మాల్యాద్రి(50) మంగళవారం ఉదయం మృతిచెందాడు. చికిత్స పొందుతున్న వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

2024లో టీడీపీ ఓడిపోవడం ఖాయం



తిక్కన పార్కును ప్రారంభిస్తున్న నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరు(బృందావనం): 2024 సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోవడం ఖాయమని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. నగరంలోని 52వ డివిజన్ రంగనాయకులపేట పెన్నా బ్యారేజీ వద్ద సుమారు రూ.కోటితో పునఃనిర్మాణం చేసిన తిక్కన పార్కును ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కందుకూరులో జరిగిన చంద్రబాబునాయుడి సభలో ఎనిమిది మంది మృతిచెందడం బాధాకరమన్నారు. చిన్నచిన్న ప్రాంతాల్లో సభలు ఏర్పాటు చేసుకోవడం సబబుకాదన్నారు. మైదానాల్లో సభలు పెట్టుకోవాలే తప్ప.. ఇరుకు సందుల్లో కాదన్నారు. చంద్రబాబు సభలు మైదానాల్లో ఏర్పాటు చేస్తే ఏ మాత్రం ప్రజలు వస్తున్నారో తెలుస్తుందన్నారు. అలా కాదని ఇరుకు సందుల్లో పెట్టి ప్రజలు ఉప్పెనలా వస్తున్నారని, సభలు విజయవంతమవుతున్నాయని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎప్పుడైనా సభలు నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం ఎప్పుడు సభలు పెట్టినా జనం వేలాది వస్తారన్న ఆలోచనతో విశాలమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఎప్పుడూ ఇరుకుసందుల్లో సభలు నిర్వహించలేదని అనిల్ అన్నారు. 2024లో ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తారన్నారు. తెలుగుదేశం పార్టీ గల్లంతవడం ఖాయమన్నారు. ముందస్తు ఎన్నికలు వస్తే వైఎస్సార్‌సీపీ ఇంటికి వెళ్తుందని, చేసేదేమి లేదని కొందరు మాట్లాడడం తగదన్నారు.

కారును ఢీకొన్న ఆటో

- ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన సయ్యద్

అనుమసముద్రంపేట: కారును ఆటో ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని హసనాపురం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సయ్యద్ ఆదాంఖాన్, అతడి కుటుంబం హసనాపురంలోని ఆటో ఎక్కారు. అక్కడి నుంచి ఆటో ఏఎస్‌పేట దర్గాకు బయలుదేరగా.. హసనాపురం దాటిన వెంటనే మామిడి తోటల వద్ద అదుపుతప్పి ఆగి ఉన్న కారును ఢీకొంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ మహబూబ్‌జాన్, ఆదాంఖాన్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.